PRGI No. APTEL/2010/31893

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

ఆదివారం, జూన్ 21, 2026

AP & TG

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 17 (Issue: 17) | పేజీలు : 4 (Pages : 4) | వెల : రూ 2.00/- (Rs : 2.00/-)

## టిటిడికి రూ.20 లక్షల విరాళం

**అన్నప్రసాదం ట్రస్టుకు ఇద్దరు దాతల నుంచి విరాళం**

హైదరాబాద్, జూన్ 20 (ఆరఎనఎ): తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టులకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తలు వడ్లమూడి లలిత్‌కుమార్, యలమంచిలి కృష్ణారావు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల విరాళం ప్రకటించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ నాయుడు ను కలిసి విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా నిత్యం లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ కోసం సహకారం అందించిన దాతలను బీఆర్ నాయుడు అభినందించారు. అన్నప్రసాదం సేవ మహాయజ్ఞం లాంటిదని, భక్తుల సహకారం టిటిడి సేవా కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం



## ఖతార్ పాలకుల ఔదార్యం

ట్రంప్‌కు 747 జంబో జెట్ బహుమతి

అమెరికా అధ్యక్షుడు విమానాన్ని ఆవిష్కరించారు

'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించిన ట్రంప్

కొత్త ఎయిర్‌ఫోర్స్ వన్ వచ్చే వరకు ఇదే వినియోగం

2

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

వారం రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

2


రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

48 గంటల్లోనే ధాన్యం కొనుగోలు డబ్బుల జమ

సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలి

అన్నదాతలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం: చంద్రబాబు





2

రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. 'పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ' పథకం కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతులకు రూ.3,125 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

- కొత్తస్వరం న్యూస్, పల్నాడు

## ఒడిషాలో రూ.47 వేల కోట్ల

# అభివృద్ధి పనులకు శ్రీకారం

**రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రధాని ప్రకటన**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పలు ప్రాజెక్టుల ప్రారంభం

పహాడ్‌పూర్‌ను సౌర గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడి

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని

భువనేశ్వర్, జూన్ 20 (కొత్త స్వరం) : ఒడిషా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మయూర్‌భంజ్‌లో నిర్వహించిన "వికాస్ రా ధారా–ఒడిశా సారా" బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిషా సమగ్రాభివృద్ధి కోసం దాదాపు రూ.47 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజునే ఈ కార్యక్రమం జరగడం విశేషంగా నిలిచింది. అనంతరం ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని సందర్శించి, ఆ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి సౌర గ్రామంగా మార్చనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఒడిషాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్యదేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే పహాడ్‌పూర్ కూడా ప్రపంచ పటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా కొత్త గుర్తింపు పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మలచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి వేగంగా సాగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించడంలో "ఉత్కర్ష్ ఒడిశా" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లల విద్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య నమూనా పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని పవిత్ర వనాల్లో సంప్రదాయ పూజలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిషాలో పండుగ వాతావరణం నెలకొన్నదని, జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ప్రధాని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనే ద్వంద్వ పండుగను ఒడిషా జరుపుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు.







కొత్త స్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com


# పాడి రైతులకు ప్రభుత్వం భరోసా

## 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు

## పాడి రైతులకు బకాయిలు లేకుండా చెల్లింపులు

## లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ

## ఆధునిక పద్ధతులతో పాల ఉత్పత్తి పెంపుపై దృష్టి



**హైదరాబాద్, జూన్ 20 (కొత్త స్వరం) :**
రాష్ట్రంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయ డెయిరీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించి పాల ఉత్పత్తిదారుల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, పాల సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. రాష్ట్రంలోని పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఇందుకు అవసరమైన పాల ఉత్పత్తి వివరాలను ఖచ్చితంగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని, వాటి ద్వారా లభిస్తున్న వాస్తవ పాల ఉత్పత్తిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలకు సరఫరా చేసే పాల బిల్లులను సంక్షేమ శాఖల ద్వారా నేరుగా సంబంధిత విభాగాలకు బదిలీ చేయాలని సూచించారు. దీంతో రైతులకు చెల్లింపుల్లో జాప్యం ఉండదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని చెప్పారు. తెలంగాణలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.

# బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

**వారం రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

**హైదరాబాద్, జూన్ 20 (కొత్తస్వరం) :**
కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కు న్యాయస్థానంలో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై జైలులో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా జైలు జీవితం గడుపుతున్న భగీరథ్ తరఫు న్యాయవాదులు ఇంజినీరింగ్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో మధ్యంతర బెయిల్ కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ఈ నెల 26 వరకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో భగీరథ్‌పై POCSO Act కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. అతడిని అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. కొంతకాలం అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. అప్పటి నుంచి జైలులో ఉన్న భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

# రైతు సంక్షేమానికి కూటమి సర్కార్ కృషి

**పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధరల కల్పన**

**అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిలప్రియ**

**నంద్యాల, జూన్ 20 (కొత్తస్వరం) :**



రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని భూమా అఖిలప్రియ అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని అఖిలప్రియ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 42,981 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం తొలి విడతలో ఒక్కొక్కరికి రూ.7,000 చొప్పున, మొత్తం రూ.29.10 కోట్లు జమ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం నిధుల జమకు సంబంధించిన చెక్కును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పీఎం కిసాన్ నిధులు విడుదల

**రూ.2,000 చొప్పున రూ.18,880 కోట్లు జమ**

**హుగ్లీ జిల్లాలో నిధులు విడుదల చేసిన ప్రధాని మోదీ**

**కోల్‌కతా, జూన్ 20 (కొత్తస్వరం) :**
కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ పథకం కింద 23వ విడత నిధులను విడుదల చేసింది. నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా లో జరిగిన కార్యక్రమంలో ఈ నిధులను విడుదల చేశారు. ఈ విడతలో దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున, మొత్తం రూ.18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. దీంతో రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన ఆర్థిక సాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రైతులకు సంవత్సరానికి మూడు విడతల్లో రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. లబ్ధిదారుల జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవాలనుకునే రైతులు అధికారిక వెబ్‌సైట్ పీఎం కిసాన్ పోర్టల్ ను సందర్శించి రైతు విభాగంలో వివరాలు పరిశీలించవచ్చు. అలాగే ఈ-కేవైసీ పూర్తి చేయని వారికి నిధులు జమ కావని అధికారులు సూచించారు. ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు.

# అరుదైన వ్యాధిగ్రస్తులకు సర్కార్ అండ

**ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**అమరావతి, జూన్ 20 (కొత్తస్వరం) :**
ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి అండగా నిలిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రత్యేక విధానాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. అరుదైన వ్యాధులపై జాతీయ విధానానికి అనుగుణంగా కొత్త విధానాన్ని త్వరలో రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సేవలు, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు ప్రత్యేక రిఫరల్ కేంద్రాలు, ఒక అత్యుత్తమ వైద్య కేంద్రం ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోందన్నారు. అరుదైన వ్యాధుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థతో పాటు వైద్యులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం



**రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం**

**48 గంటల్లోనే ధాన్యం కొనుగోలు డబ్బుల జమ**

**సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలి**

**అన్నదాతలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం: చంద్రబాబు**

**పల్నాడు, జూన్ 20 (కొత్త స్వరం) :**
రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రైతు సంతోషంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో నిర్వహించిన 'పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ' నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయో లేదో తమ మొబైల్ ఫోన్లలో చూసి చెప్పాలని రైతులను కోరగా, పలువురు రైతులు డబ్బులు జమయ్యాయని తెలియజేశారు. సాంకేతికత పెరగడంతో క్షణాల్లో సమాచారం అందుబాటులోకి వస్తోందని చంద్రబాబు అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించడంతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ఇచ్చిన మాట ప్రకారం సంపద సృష్టించి రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా నిలుస్తున్నామని, బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతుల ఖాతాల్లో నిధులు జమయ్యాయని తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత నెలల తరబడి డబ్బులు రావని, ప్రస్తుతం తమ ప్రభుత్వం 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి, తెలంగాణ అంటే మెట్టపొలాలు అనేవారని, ఇప్పుడు తెలంగాణలో కూడా భారీగా వరి సాగు జరుగుతోందని పేర్కొన్నారు. రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. అధిక రసాయనాల వినియోగం వల్ల విదేశీ మార్కెట్లలో మన ఉత్పత్తులకు డిమాండ్ తగ్గే ప్రమాదం ఉందన్నారు. రైతులకు లాభసాటిగా ఉండే పామాయిల్ పంటను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాయలసీమను ఉద్యానవన పంటల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ' పథకం కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.3,125 కోట్లు జమయ్యాయి. అనంతరం సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# భూదాన భూముల కబ్జాలపై ఆందోళన



**అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**భూదాన భూములు నిజమైన పేదలకు పంపిణీ చేయాలి**

**కబ్జాదారులపై కఠిన చర్యలు కోరిన సర్వోదయ మండల్**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై శంకర్ నాయక్ ఆవేదన**

**మేడ్చల్‌మల్కాజ్గిరి, జూన్ 20 (కొత్త స్వరం) :**
తెలంగాణ రాష్ట్రంలో భూదాన భూములు కబ్జాలు, అక్రమాలకు గురవుతున్నప్పటికీ వాటిని పట్టించుకునే ప్రభుత్వాలు గానీ, నాయకులు గానీ లేరని తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లాలోని బాలాజీ నగర్ దళిత భవన్‌లో దయానంద్ అధ్యక్షతన సర్వోదయ మండల్ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి వై. గిరిప్రసాద్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 1.79 వేల ఎకరాల భూదాన భూములు ఉన్నప్పటికీ వాటి పరిరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదని అన్నారు. ఈ భూములను కబ్జాదారుల నుంచి రక్షించి నిజమైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూదాన భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా గాంధీభవన్‌లో భూదాన్ బోర్డు పేరుతో అక్రమాలు కొనసాగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు భూదాన్ యజ్ఞ బోర్డు కార్యాలయాన్ని ఖాళీ చేయించడంలో అలసత్వం చూపుతున్నారని ఆరోపించారు. తప్పుడు పత్రాలు సృష్టిస్తూ పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందని, ఇలాంటి మోసాలను ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, షేక్ షావలి, ఐఎఫ్‌టీయూ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేష్, వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, అనంతలక్ష్మి, జిల్లా, మండలాల సర్వోదయ మండల్ సభ్యులు పాల్గొన్నారు.

# ఖతార్ పాలకుల ఔదార్యం

**ట్రంప్‌కు 747 జంబో జెట్ బహుమతి**

**అమెరికా అధ్యక్షుడు విమానాన్ని ఆవిష్కరించారు**

**'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించిన ట్రంప్**

**కొత్త ఎయిర్‌ఫోర్స్ వన్ వచ్చే వరకు ఇదే వినియోగం**

**వాషింగ్టన్, జూన్ 20 (కొత్త స్వరం) :**
ఖతార్ పాలకులు బహుమతిగా అందించిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకపై కొంతకాలం పాటు ఈ విమానంలోనే ప్రయాణాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విమానాన్ని ఆయన "ఎగిరే వైట్‌హౌస్"గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విమానాన్ని ప్రజలకు పరిచయం చేశారు. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానాల్లో ఒకటని ట్రంప్ పేర్కొన్నారు. విమానంలోని అంతర్గత అలంకరణ, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే ఇది వేగంగా, ఎక్కువ దూరం ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. జూలై 4న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నిర్వహించే విమాన ప్రదర్శనలో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని వెల్లడించారు. విమానంలో లెదర్ సీట్లు, బంగారు ఛాయలతో అలంకరించిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ విలాసవంతమైన సదుపాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు 747-200బి మోడల్ ఎయిర్‌ఫోర్స్ వన్‌గా అమెరికా అధ్యక్షుల అధికారిక విమానంగా సేవలందించింది. జార్జ్ హెచ్.డబ్ల్యూ. బుష్ నుంచి ట్రంప్ వరకు పలువురు అధ్యక్షులు అదే విమానాన్ని ఉపయోగించారు. అది అత్యాధునికం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రోటోకాల్ విభాగం అధికారులు తెలిపారు. అమెరికా వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్ 747 విమానాలు అందే వరకు, ఖతార్ నుంచి బహుమతిగా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ అధికారిక ప్రయాణాలకు వినియోగించనున్నట్లు సమాచారం.

# అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ తొలి విడత నగదు రైతుల ఖాతాల్లో జమ

**7257 మంది రైతులకు రూ.4.93 కోట్ల లబ్ధి: షహబుద్దీన్**







**ఆత్మకూరు, జూన్ 20 (కొత్తస్వరం):**
నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 2026–27 తొలి విడత నిధుల జమ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిందని సింగిల్ విండో చైర్మన్ ఏ. షహబుద్దీన్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె. హేమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ. షహబుద్దీన్ మాట్లాడుతూ, ఆత్మకూరు మండలానికి చెందిన 7257 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద కలిపి రూ.4 కోట్ల 93 లక్షలు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, అధ్యక్షుడు రవీంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, రైతు సంఘం నాయకులు అశ్రఫ్ అలీ, షేక్ నభి, దినకర్, శివశంకర్ శర్మ, శివారెడ్డి, నాగేంద్రరావుతో పాటు మండలంలోని రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
ఆదివారం, జూన్ 21, 2026 పేజీ 3


# అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

**ఉలిందకొండలో రైతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు**

**తొలి విడత నిధుల విడుదలతో రైతులకు ఊరట**

**రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి**

కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం) : కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ – ప్రధానమంత్రి కిసాన్ తొలి విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన అధికారులు, ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పంటల సాగుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో ఈ నిధులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్






## రక్షణ గోడ లేక ప్రజల్లో ఆందోళన

విరిగిపడ్డ ఫ్యూజ్ బాక్స్ డోర్

రాత్రివేళల్లో అటు వెళ్లేవారికి ఇబ్బందులు

వాన, గాలికి స్పార్క్ వస్తోందని స్థానికుల ఆందోళన

తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి

కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం): నందికొట్కూరు రోడ్డులోని రెవెన్యూ కాలనీలో సిరి హోమ్స్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఫ్యూజ్ బాక్స్ డోర్ విరిగి కింద పడిపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అటుగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానలు, గాలుల కారణంగా ఫ్యూజ్ పోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు లైన్‌మెన్లు వచ్చి ఫ్యూజ్ వేసి వెళ్తున్నారే గానీ, ఫ్యూజ్ బాక్స్ డోర్‌ను సరిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈదురు గాలులు, వర్షాల సమయంలో అప్పుడప్పుడు స్పార్క్ వస్తోందని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేసి, ఫ్యూజ్ బాక్స్‌కు తక్షణ మరమ్మతులు చేయించాలని విద్యుత్ ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.





# నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు







16 పరీక్షా కేంద్రాల్లో 4,995 మంది విద్యార్థులు

ప్రశ్నాపత్రాల రవాణాకు సీఆర్పీఎఫ్‌తో ప్రత్యేక ఎస్కార్ట్

ట్రాఫిక్, భద్రతపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం

పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం) : నీట్ (యూజీ)–2026 పునఃపరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్ష నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 4,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, ప్రతి కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తుతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా సమయంలో కర్నూలు పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బందితో ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా సహకరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి, అభ్యర్థులను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఫ్రిస్కింగ్ నిర్వహించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, బ్లూటూత్ ఇయర్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణ మొత్తం కేంద్ర స్థాయిలో పర్యవేక్షణలో ఉంటుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్ష సమయం వరకు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## గాయపడిన విలేఖరికి అండగా గుమ్మనూరు జయరాం

**రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేత**

**ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సహాయం**

**కృతజ్ఞతలు తెలిపిన పాత్రికేయులు**



చిప్పగిరి, జూన్ 20 (కొత్త స్వరం): చిప్పగిరి మండలానికి చెందిన విశాలాంధ్ర విలేఖరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న మాజీ మంత్రి, ప్రస్తుతం గుమ్మనూరు జయరాం మానవీయ స్పందనతో ముందుకు వచ్చి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సహాయం అందించగా, బాధిత విలేఖరి తరపున అలాగే ఏపీయూడబ్ల్యూజే, విశాలాంధ్ర కుటుంబ సభ్యులు గుమ్మనూరు జయరాంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అవసర సమయంలో పాత్రికేయులకు అండగా నిలుస్తూ, వారి పట్ల మానవీయ దృక్పథాన్ని ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలతో పాటు పాత్రికేయులకు కూడా ఇలాగే భవిష్యత్తులో అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేర నియంత్రణ.. ప్రజల భద్రతే లక్ష్యం

**రాత్రివేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్**

**రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు**

**'స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో'తో వాహనదారులకు అవగాహన**

**నీట్ ప్రశ్నపత్రాల భద్రతపై ప్రత్యేక తనిఖీలు**





కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కర్నూలు నగరంలో మూడవ పట్టణ సీఐ శేషయ్య ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా నిర్వహించారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. దీర్ఘదూర ప్రయాణాల్లో అలసటకు గురయ్యే డ్రైవర్లు కాసేపు ఆగి, ముఖం కడుక్కొని విశ్రాంతి తీసుకుని ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. నీట్ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో ప్రశ్నపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, భద్రపరిచిన ప్రశ్నపత్రాల భద్రతా ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. భద్రతా చర్యలను తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–112 లేదా డయల్–100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


పాత్రికేయులు కావలెను

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్తస్వరం 9492813364

# కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
## కర్నూలు - నంద్యాల
ఆదివారం, జూన్ 21, 2026



## రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, సంయుక్త కలెక్టర్

**సునయన సభాభవనంలో ఘనంగా రెవెన్యూ దినోత్సవం**

**సేవా భావంతో పనిచేయాలని అధికారులకు సూచన**

**ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని పిలుపు**




**కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం) :**
కలెక్టరేట్‌లోని సునయన సభాభవనంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, సంయుక్త కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవల ప్రాధాన్యతను అధికారులు వివరించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి అధికారికి ముఖ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు**

**ప్రతి శనివారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు**

**ఓవర్ స్పీడ్, డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు అధికం**

**నిబంధనలు పాటించాలని ప్రజలకు పోలీసుల సూచనలు**





**కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం):**
రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా కర్నూలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ డా. కోయ ప్రవీణ్ ఐపీఎస్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2026 జనవరి 1 నుంచి జూన్ 19 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ కాలంలో ఓవర్ స్పీడ్‌కు సంబంధించి 4,106 కేసులు, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన వారిపై 3,145 కేసులు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన వారిపై 1,089 కేసులు నమోదు చేశారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవింగ్‌పై 4,258 కేసులు, ఓపెన్ డ్రింకింగ్‌పై 7,963 కేసులు, మైనర్ డ్రైవింగ్‌పై 52 కేసులు, ట్రిపుల్ డ్రైవింగ్‌పై 286 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**2026-27 తొలి విడత నిధుల విడుదల**

**రైతన్నలకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం**

**మొదటి విడతలో ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేల జమ**

**ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులతో ఎమ్మెల్యే చర్చ**



**వెలుగోడు, జూన్ 20 (కొత్తస్వరం) :**
వెలుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 2026–27 తొలి విడత నిధుల విడుదల కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం ద్వారా రైతన్నలకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తొలి విడత నిధుల విడుదల సందర్భంగా ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేల చొప్పున ఎన్డీయే ప్రభుత్వం జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులతో మమేకమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు, సాగునీటి భద్రత, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై చర్చించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు

**డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు**


**మూడు రోజుల పాటు వైభవంగా మహోత్సవాలు**

**భక్తిశ్రద్ధలతో నిర్వహించిన యాగాలు, పూజలు**

**గ్రామ ఐకమత్యానికి నిదర్శనంగా నిలిచిన వేడుకలు**

**సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపిన నాగేశ్వరరావు**

**పాములపాడు, జూన్ 20 (కొత్తస్వరం) :**
పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో పునర్నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ హనుమత్ సమేత ధ్వజ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించామని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను పుట్టినప్పటి నుంచి ఇలాంటి మహోత్సవాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. పూర్వీకులు నిర్మించిన శ్రీరామాలయాన్ని పునరుద్ధరించి, మహోత్సవాలతో పునఃప్రారంభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సుమారు 98 సంవత్సరాల క్రితం నిర్మితమైన ఈ పవిత్ర దేవాలయంలో, భగవంతుని అనుగ్రహంతో తన తల్లి టేకూరి రామ సుబ్బమ్మ ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠా మహోత్సవం జరగడం అపూర్వ ఆనందాన్ని కలిగించిందన్నారు. 2019 మార్చి 31న పునాదులు వేసిన ఈ ఆలయం ఎన్నో ఆటంకాలను అధిగమించి నేడు మహోత్సవ వైభవంతో నిలవడం దైవకృపకు నిదర్శనమని పేర్కొన్నారు. జూన్ 17న తన తండ్రి స్వర్గీయ టేకూరి కృష్ణుడు వర్ధంతి రోజునే ఆయన ఆశయమైన దేవాలయ పునఃప్రతిష్ఠ పూర్తవడం ఎంతో భావోద్వేగ క్షణమని అన్నారు. ఇది యాదృచ్ఛికం కాదని, శ్రీరాముని సంకల్పమేనని విశ్వసిస్తున్నామన్నారు. జూన్ 15, 16, 17 తేదీలు వేంపెంట గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని చెప్పారు. ఈ మూడు రోజుల పాటు యాగాలు, హోమాలు, పూజలు, చెక్క భజన, బాహుబలి హనుమాన్ శోభాయాత్ర, గ్రామోత్సవం, సంగీత విభావరి వంటి కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. గ్రామ ప్రజల ఐకమత్యం, భక్తి, సేవాభావం ఈ మహోత్సవ విజయానికి ప్రధాన కారణమన్నారు. ఆడపడుచులు గ్రామానికి చేరుకోవడంతో ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడి, ఊరంతా పండుగ వాతావరణంలో మునిగిపోయిందన్నారు. ఈ మహోత్సవం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు, భక్తులు, యువత, మహిళలు, సేవకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ దేవాలయ పునఃప్రతిష్ఠకు వచ్చిన ప్రతి ఒక్కరిపై శ్రీ సీతారామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ మరోసారి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



## సగం ఎండినా.. మళ్లీ చిగురించిన చెట్టు





**ప్రకృతి చెప్పిన ఆత్మవిశ్వాస సందేశం**

**వానతో మళ్లీ ప్రాణం పోసుకున్న వృక్షం**

**ఎండిన కొమ్మల మధ్య పచ్చని చిగుర్లు**

**చూసిన వారిలో ఆలోచన రేకెత్తిస్తున్న దృశ్యం**

**జీవిత పోరాటానికి చెట్టు నిలువెత్తు ఉదాహరణ**

**కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం):**
నందికొట్కూరు రోడ్డులోని రెవెన్యూ కాలనీలో ఉన్న వేప చెట్టు ప్రస్తుతం అటుగా వెళ్తున్న ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆ చెట్టు విరిగి నేలకూలింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, కిందపడిన వేప చెట్టు సగం భాగం పూర్తిగా ఎండిపోయి ఉండగా, మరో సగం మాత్రం పచ్చని చిగుర్లతో కళకళలాడుతోంది. ఎండిపోయినట్టే కనిపించిన వేప చెట్టు మళ్లీ ప్రాణం పోసుకున్నట్లు కనిపించడం స్థానికులను ఆలోచనలో పడేస్తోంది. సగం ఎండిపోయినా, మిగిలిన భాగం కొత్త చిగుర్లతో జీవం పొందడం చూసిన ప్రజలు ఆశ్చర్యంతో పాటు ప్రేరణ పొందుతున్నారు. "పడ్డ వాడు చెడ్డ వాడు కాదు" అనే సామెతను ఈ చెట్టు సాక్షాత్కరింపజేస్తోందని స్థానికులు చెబుతున్నారు. జీవితంలో ఎన్నో కష్టాలు, ఎదురుదెబ్బలు వచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మళ్లీ లేచి నిలబడాలని ఈ చెట్టు మౌనంగా సందేశం ఇస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి చూపిస్తున్న ఈ చిన్న దృశ్యం మనిషికి గొప్ప జీవన పాఠంగా నిలుస్తోంది. కష్టాల ముందు కుంగిపోకుండా, ప్రతి ఓటమిని కొత్త ప్రారంభంగా మార్చుకోవచ్చని ఈ చెట్టు నిరూపిస్తోంది.

## ఆర్థిక సహాయం అందజేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



**పెరుమాళ్ల ప్రదీప్ (బాలు) కుటుంబానికి రూ.50 వేల సాయం**

**నందికొట్కూరు, జూన్ 20 (కొత్త స్వరం):**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మరియు నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ సహకారంతో మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి చేతుల మీదుగా పెరుమాళ్ల ప్రదీప్ (బాలు) సతీమణికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో పార్టీ తరఫున సహాయం అందించడం ద్వారా మానవీయతను చాటుకున్నారని స్థానికులు అభినందించారు.



## తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

**హలో కార్మిక.. ఛలో మహబూబ్‌నగర్ పిలుపు**

**వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు భారీగా హాజరుకావాలి**

**ఉపాధి హామీ చట్ట రక్షణపై మహాసభల్లో చర్చ**

**కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందింపు**

**తాండూర్, జూన్ 20 (కొత్త స్వరం) :**
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు యాలాల మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు, కార్మికులతో కలిసి మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 20, 21, 22 తేదీల్లో మహబూబ్‌నగర్ పట్టణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీల సమస్యలపై సంఘం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. మహాసభల్లో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాలపై సమీక్షతో పాటు, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడం, కూలీల భద్రత కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు మాజీ మాణిక్ సర్కార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. అలాగే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు విజయ్ రాఘవన్, బి. వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు పాల్గొననున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ వర్కర్లు, హమాలీలు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి. రత్నం, డి. రాజ్‌కుమార్, ఆరిఫ్, శివ, చంద్రప్ప, నర్సిములు, షబ్బీర్, నారాయణ, సరస్వతి, శ్యామమ్మ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

## ట్ పరీక్ష, ప్రత్యేక సవరణ ప్రక్రియపై విలేకరుల సమావేశం నిర్వహించిన కలెక్టర్

**పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**ప్రత్యేక సవరణ ప్రక్రియపై కీలక వివరాల వెల్లడి**

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష**

**కర్నూలు, జూన్ 20 (కొత్త స్వరం) :**
కలెక్టరేట్‌లోని చిన్న సమావేశ మందిరంలో నీట్ పరీక్ష నిర్వహణ, ప్రత్యేక సవరణ ప్రక్రియ, అలాగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను కూడా వివరించిన కలెక్టర్, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయని వెల్లడించారు.




# వ్యవసాయాభివృద్ధే లక్ష్యం

## రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ






ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌తో రైతులకు ఆర్థిక భరోసా

జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల జమ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

పోలూరు గ్రామ సమస్యల పరిష్కారానికి హామీ

**నంద్యాల, జూన్ 20 (కొత్త స్వరం) :**
వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి బాటవేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్రం నుంచి రూ.2 వేలు, రాష్ట్రం నుంచి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలు, మూడో విడతలో కేంద్రం నుంచి రూ.2 వేలు, రాష్ట్రం నుంచి రూ.4 వేలు కలిపి రూ.6 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ.29.10 కోట్లు, బనగానపల్లెలో 40,664 మంది రైతులకు రూ.27.41 కోట్లు, నంద్యాలలో 36,734 మంది రైతులకు రూ.24.94 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. రసాయన ఎరువుల మితిమీరిన వినియోగం భూమి సారాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని, రైతులు సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పోలూరు గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోకుండా ఇప్పటికే రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామంలోని సీసీ రోడ్లు, పొలాల రహదారుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను అర్థం చేసుకుని అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తోందన్నారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయప్రకాశ్ రెడ్డి, డీఎచ్ఓ నాగరాజు, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, వ్యవసాయ శాస్త్రవేత్తలు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ

**అన్ని పోలీసు స్టేషన్లు, కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు**

**ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం తీసుకురావాలి**

**పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి**

**పచ్చదనం పెంపుకు మొక్కలు నాటిన సిబ్బంది**





**నంద్యాల, జూన్ 20 (కొత్త స్వరం) :**
నంద్యాల జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు, పోలీసు కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం తీసుకురావడంలో పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నెల మూడో శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన నేపథ్యంలో, రాష్ట్ర పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని నేర పరిశోధన విభాగం, ప్రత్యేక శాఖ, పాస్‌పోర్టు కార్యాలయం, సైబర్ నేర విభాగం, ఫ్యాక్షన్ జోన్, సాయుధ బలగాలు, మోటార్ వాహన విభాగంతో పాటు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లు, కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాలు మరియు పరిసరాలను సమగ్రంగా శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధులు నిర్వహించే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో, అదే విధంగా పనిచేసే ప్రదేశాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తద్వారా అనారోగ్య సమస్యలు, విషజ్వరాల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచడంలో పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## నూనెపల్లిలో అంగన్వాడీలు, పాఠశాలల తనిఖీ

**విద్యార్థుల భోజన నాణ్యతపై మాజీ ఎమ్మెల్యే భూమా ఆరా**

**గర్భిణీలకు అందుతున్న పోషకాలపై ప్రత్యేక పరిశీలన**

**అంగన్వాడీ సేవలు మెరుగుపర్చాలని సూచన**

**చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం**

**నంద్యాల, జూన్ 20 (కొత్తస్వరం) :**
నంద్యాల పట్టణంలోని నూనెపల్లి ప్రాంతంలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాలు, ఠాగూర్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన, ఆహార నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న విద్యా సదుపాయాలు, పాఠశాలలో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. చిన్నారులకు అందించే ఆహారం పోషక విలువలతో కూడి ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. పిల్లల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన భూమా బ్రహ్మానందరెడ్డి, అక్కడ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పిల్లల విద్యాభివృద్ధి, మహిళల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




**రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్**

**రైతుభరోసా, రుణమాఫీపై కాంగ్రెస్‌ను ప్రశ్నించిన బీఆర్ఎస్**

**ధాన్యం కొనుగోలు, యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ**

**హామీలు నెరవేర్చకపోతే ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరిక**

**బెల్లంపల్లి, జూన్ 20 (కొత్త స్వరం):**
బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఆరోపించారు. రైతుభరోసా, రైతుభీమా, రైతు రుణమాఫీ, బోనస్ వంటి పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, సుమారు 30 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో కనిపించడం లేదని అన్నారు. రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంలోనూ, సరైన సమయంలో యూరియా అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలుపై ప్రశ్నిస్తున్న రైతులను అధికార బలంతో అణిచివేస్తూ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : బీఆర్ఎస్వీ డిమాండ్

అధిక ఫీజులతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం

విద్యను వ్యాపారంగా మార్చొద్దని హెచ్చరిక

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరిక




**బెల్లంపల్లి, జూన్ 20 (కొత్త స్వరం):**
బెల్లంపల్లి పట్టణం, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు బెల్లంపల్లి మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణం మరియు మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అధిక ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కార్పొరేట్ విద్యా వ్యవస్థకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లుగా ఉందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కాల్టెక్స్ ఏరియాలో ఉన్న ఒక పాత ప్రైవేట్ పాఠశాలను కొనుగోలు చేసి, పాత పేరుతో కాకుండా "తవక్కల్ విద్యా సంస్థలు" పేరుతో నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికార యంత్రాంగం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఆడెపు అరుణ్, ప్రధాన కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, కార్యదర్శి వడ్డేపల్లి నితీష్, నాయకులు బడికల ప్రణీత్, ఎనగందుల సాయి కిరణ్, గడ్డం శివ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.